
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రక్షణగా నేనున్నా..

ముందే వానాకాలం.. వర్షం పడితే కాలనీల్లో, రహదారులపై వరదనీరు చేరి చెరువులను తలపిస్తాయి.. డ్రైనేజీలో పొంగి పొర్లుతాయి.. మ్యాన్‌హోల్ ఎక్కడ ఉందో తెల్వదు.. వాటిపై మూతలు ఉన్నాయో లేదో అసలే తెల్వదు.. మృత్యువు ఏ రూపంలో కబళిస్తుందో ఊహించలేము.. ఇలాంటి పరిస్థితుల్లో మ్యాన్‌హోల్‌పై మూత లేకపోతే నేమీ.. నేను రక్షణగా ఉన్నానని ఈ మొక్క చెబుతోంది. తాండూరు పట్టణంలోని చించోళి -మహబూబ్‌నగర్ జాతీయ రహదారి మార్గంలో డ్రైనేజీ నీరు వెళ్లేందుకు పెద్ద మురుగు కాల్వను నిర్మించారు. ఈ కాల్వ ఉన్న మార్గంలో మధ్యలో డ్రైనేజీలో చెత్తా చెదారం తొలగింపునకు మ్యాన్‌హోళ్లను ఏర్పాటు చేశారు. అయితే మ్యాన్‌హోళ్లపై కొన్ని చోట్ల మూతలు లేక ప్రమాదకరంగా మారాయి. స్నేహ మార్కెట్ ఎదుట ఉన్న మ్యాన్‌హోల్‌కు మూత లేకపోవడంతో కాల్వలో చెత్తపేరుకుపోయి మొక్కలు మొలిచాయి. అందులో ఎవరూ పడకుండా రక్షణ నిలిచాయి.

- తాండూరు, జూలై 10



పచ్చని సోయగం



కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షాలకు పంట చేలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. తాండూరు మండల పరిధిలోని అల్లాపూర్, సిరిగిరిపేట్, జినుగుర్తి, ఉద్దండాపూర్, గుండమడుగు తండా, మైసమ్మగడ్డ తండా, సంకిరెడ్డిపల్లి, కొత్లాపూర్, బెల్కటూర్, నారాయణపూర్, గోనూరు, వీర్‌శెట్టిపల్లి, అంతార తదితర గ్రామాల్లో రైతులు 5వేల ఎకరాల్లో మినుము పంటను సాగు చేశారు. ఇటీవల కురిసిన వానలతో పంట ఏపుగా పెరిగింది.. దీంతో చేనులో రైతులు దంతె పనులు చేపట్టారు. పంటలు ఆశాజనంగా ఉండటంతో సంతోషం వ్యక్తం చేశారు.

- తాండూరు రూరల్, జూలై 10

పేదల కోసం పనిచేసేది కాంగ్రెస్సే

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



చెక్కులను అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, జూలై 10 : పేదల కోసం పనిచేసేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వికారాబాద్ మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబాకర్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గత ప్రభుత్వ పాలకులు తెలంగాణ రాష్ట్రాన్ని విధ్వంసం చేసి ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించారని, అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తారని అన్నారు. గత ప్రభుత్వం లాగా మాయ మాటలు చెప్పి ప్రజల్ని మోసం చేసి ఇచ్చిన మాట మర్చిపోయే ప్రభుత్వం కాదని కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు పేద ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతుందన్నారు. పేదలకు తోడుగా ఉంటుందని, మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా ఆరు గ్యారెంటీ పథకాలు అర్హులైన ప్రజలందరికీ అందించే బాధ్యత తనదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, కోఆప్షన్ మెంబర్ ఎర్రవల్లి జాఫర్, మండల రెవెన్యూ అధికారి లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచులు వెంకట్ రెడ్డి, మోహన్, నాయకులు శివయ్య, తుక్కరాం, బందెల్లి, మల్లేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



గోల్డ్ మెడలిస్ట్‌కు ఘన స్వాగతం


- ఏషియా సౌత్ ఆఫ్రికన్ పసిఫిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సుకన్యబాయికి స్వర్ణ పతకం
- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో తల్లిదండ్రులు, బంధుమిత్రులు, అభిమానుల గ్రాండ్ వెల్‌కమ్

శంషాబాద్ రూరల్, జూలై 10 : పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో బంగారం పతకం సాధించి హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన తేజావత్ సుకన్యబాయికి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం లభించింది. ఈనెల 7న సౌత్ ఆఫ్రికాలో జరిగిన ఏషియా సౌత్ ఆఫ్రికన్ పసిఫిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో హైదరాబాద్‌కు చెందిన తేజావత్ సుకన్యబాయి బంగారం పతకం సాధించారు. 76 కిలోల విభాగంలో పోటీపడి బంగారు పతకం సాధించారు. బుధవారం సౌత్ ఆఫ్రికా నుంచి హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఆమెకు తల్లిదండ్రులు, బంధుమిత్రులు, అభిమానులు బ్యాండ్ మేళాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుకన్యబాయి విలేకరులతో మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మొత్తం 60 దేశాలు పాల్గొన్నట్లు తెలిపారు. భారత్ తరఫున మున్ముందు మరెన్నో పతకాలను సాధించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని కోరారు. మంత్రి కోమటిరెడ్డి సహాయ సహకారాలతో ఈ స్థాయికి ఎదిగానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. నేడు(గురువారం) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుస్తానని సుకన్యబాయి తెలిపారు.

నిధుల్లేక నీరసం!

గాడితప్పుతున్న పంచాయతీల పాలన

- గ్రామ పంచాయతీలపై పట్టింపేది?
- నిధుల గండం...అభివృద్ధికి ఆటంకం
- కార్మికులకు అందని వేతనాలు
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు
- కార్యదర్శులపై పెరుగుతున్న భారం





గ్రామ పంచాయతీల పాలన గాడి తప్పుతోంది. సర్పంచుల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి పల్లె పాలనకు ఇబ్బందులు ఎదురౌతున్నాయి. పంచాయతీ ఖాతాల్లో డబ్బుల్లేక పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. నిధులు సకాలంలో రాకపోవడంతో ఆ భారం పంచాయతీ కార్యదర్శులపై పడుతోంది. మరోవైపు నిధుల గండం అభివృద్ధికి ఆటంకం మారింది. కొన్ని నెలలుగా పారిశుధ్య కార్మికులకు జీతాలు రాకపోవడంతో వారిని బతిమిలాడి పని చేయించుకుంటున్నారు. ఇలా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని దాదాపు అన్నిగ్రామాల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

మేడ్చల్ జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో తాను విధులు నిర్వహించే గ్రామ పంచాయతీ ఖాతాలో నిధులు లేక ఓ కార్యదర్శి నాలుగు నెలలుగా ట్రాక్టర్ డీజిల్, వీధి దీపాల కొనుగోలు, ఇతరత్రా మరమ్మతుల కోసం సొంతంగా దాదాపు రూ. 50వేలు ఖర్చు చేశారు. ఈ ఆర్థిక భారంతో పాటు అధికారులు అప్పగిస్తున్న సర్వేలతో అదనపు భారం మోస్తున్నారు. పంచాయతీలకు మరోవైపు నిధుల గండం అభివృద్ధికి ఆటంకంగా మారింది. కొన్ని నెలలుగా పారిశుధ్య కార్మికులకు జీతాలు రాకపోవడంతో వారిని బతిమిలాడి పని చేయించుకుంటున్నారు. ఇలా జిల్లాలోని దాదాపు అన్ని గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మేడ్చల్ మండలంలోని ఓ గ్రామంలో మాజీ సర్పంచ్ పారిశుధ్య పనులు, చెత్త సేకరణ, ట్రాక్టర్ నిర్వహణ తదితర ఖర్చులు కలిపి నెలకు రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. ఆయన పదవీ కాలం ముగిసి ఆర్నెళ్లయినా ఇంకా డబ్బులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు కూడా ఇవ్వకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక మనోవేదనకు గురౌతున్నారు. ఇలా జిల్లాలోని చాలా గ్రామ పంచాయతీల్లో మాజీ సర్పంచులు తమ సొంత జేబులోంచి చేసిన ఖర్చులకు సంబంధించి డబ్బులు రాకపోవడంతో లబోదిబోమంటున్నారు.

గ్రామ కార్యదర్శులపై భారం

ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీ వరకు సర్పంచులు, పాలకవర్గాలకు బాధ్యత ఉండేది. గ్రామంలో ఏ పని కావాలన్నా వారే ముందుగా ఖర్చు చేసి తర్వాత బిల్లులు డ్రా చేసుకునేవారు. వారి పదవీకాలం ముగిసిన తర్వాత ఆభారం పంచాయతీ కార్యదర్శులపై పడింది. జిల్లాలోని పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు సొంతంగా రూ. వేలల్లో ఖర్చు చేశారు. మరికొందరు వారి వేతనాలు విడుదల కాగానే అందులో నుంచి వెచ్చిస్తున్నారు. పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, పారిశుధ్య కార్మికులకు వేతనాలు, ట్రాక్టర్ నిర్వహణ, డీజిల్ ఖర్చులు, నీటి ట్యాంకులకు సింగిల్ ఫేస్ మోటార్లు అమర్చడం వంటి పనులకు కార్యదర్శులే సొంతంగా ఖర్చు చేశారు. ఈ విషయం ఉన్నతాధికారులకు కూడా తెలుసు. ఖాతాల్లో డబ్బులు లేకున్నా పాలనను ముందుకు నెట్టుకొస్తున్నా నిధులు విడుదల చేయడంలో జాప్యం చేయడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన చెందుతున్నారు. పల్లెల నిర్వహణతో పాటు ప్రభుత్వం ఇటీవల పలు క్షేత్రస్థాయి పనులలో కార్యదర్శులను భాగస్వాములను చేస్తున్నారు. తమ శాఖకు సంబంధంలేని ఇంటింటి మిషన్ భగీరథ సర్వే చేయిస్తున్నారని, తాజాగా వ్యవసాయ సర్వే చేయాలని మౌఖికంగా ఆదేశాలు వచ్చాయని చెబుతున్నారు. ఓ వైపు పంచాయతీల నిర్వహణ, మరోవైపు సర్వేలతో తమపై పనిభారం పెరగడంతో మానసిక ఒత్తిళ్లకు గురౌతున్నామని చెబుతున్నారు.



సకాలంలో నిధులు రాక ఇబ్బందులు

పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నుంచి నిధులు విడుదల అవుతాయి. జనాభా నిష్పత్తి ప్రకారం ఆయా గ్రామాలకు విడుదల చేస్తారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఏడాదికి నాలుగుసార్లు పంచాయతీలకు అందజేస్తున్నారు. ఇక రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు రెండేళ్లుగా రావడం లేదు. నిధులు సక్రమంగా రాకపోవడంతో అప్పటి పంచాయతీ పాలకవర్గాలే సొంతంగా జేబు నుంచి ఖర్చు చేశారు. అప్పట్లో కొందరు సర్పంచులు అప్పులు కూడా చేశారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల చేయకపోవడంతో పంచాయతీల నిర్వహణకు సాధారణ నిధుల నుండి ఖర్చు చేయాల్సి వస్తున్నా... చాలా గ్రామాల్లో ఇవి సరిపోక కార్మికులకు వేతనాలే ఇవ్వలేని పరిస్థితులు నెలకొన్నాయి. చిన్న పంచాయతీల్లో ట్రాక్టర్ల నిర్వహణ కష్టంగా మారడంతో కిస్తీలు కట్టలేకపోతున్నారు. మేడ్చల్ జిల్లాలోని 61గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్ల కిస్తీలు దాదాపు రూ.లక్షల్లో బకాయి పడటంతో బ్యాంకు అధికారులు వారికి నోటీసులు జారీ చేశారు.

పట్టింపులేని ప్రత్యేకాధికారులు

పాలకవర్గాల పదవీకాలం పూర్తయ్యాయని తర్వాత పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. వీరు అప్పటికే వారి పనులు, బాధ్యతలో తీరికలేకుండా ఉంటున్నారు. ఇలాంటి సందర్భంలో వారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఒక్కొక్కరికీ రెండు, మూడు పంచాయతీలున్నాయి. దీనితో వారు పంచాయతీల పాలనను పెద్దగా పట్టించుకోవడం లేదు. ఉదాహరణకు గౌడవెల్లి గ్రామపంచాయతీకి ప్రత్యేకాధికారిగా మేడ్చల్ తహసీల్దార్‌ను నియమించారు. ప్రస్తుతం ధరణి పనుల్లో బిజీగా ఉన్న తహసీల్దార్ కనీసం చెక్కులపై సంతకాలు చేయడానికి కూడా గౌడవెల్లి గ్రామపంచాయతీ సిబ్బందికి సమయం ఇవ్వడం లేదు. దీంతో వారు పంచాయతీల పాలనను పెద్దగా పట్టించుకోవడం లేదు. కనీసం వారంలో ఒకసారి కూడా గ్రామాలకు రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. కార్యదర్శులే ముఖ్యమైన పనులు, సంతకాల కోసం ప్రత్యేకాధికారుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది.

పన్నులు వసూలు చేసి పంచాయతీల నిర్వహణ



గ్రామంలో పన్నులు వసూలు చేసి పంచాయతీ నిర్వహణ చేపడుతున్నాము. ట్రాక్టర్ ఈఎంఐ, సిబ్బంది వేతనాలు, విద్యుత్ బిల్లుల వంటివి పన్నులు వసూలు చేసి చెల్లిస్తున్నాం. కొన్ని పంచాయతీలలో 15వ ఆర్థిక సంఘం మిగులు నిధులుంటే నిర్వహణ కోసం వాడుతున్నారు.

- వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి, అంకుషాపూర్

జీతాలు రాక ఇబ్బందులు



సకాలంలో వేతనాలు రాక చాలా ఇబ్బందులు పడుతున్నాము. మా పంచాయతీలో ఏడు నెలల నుండి వేతనాలు బకాయిలు ఉన్నాయి. పూట గడువడమే కష్టం ఉన్న మాకు నెలల తరబడి వేతనాలు రాకుంటే ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నాం. వేతనాలు చెల్లించాలి.

- చిలుగురి కిష్టమ్మ, పారిశుధ్య కార్మికురాలు, మర్పల్లిగూడ

సర్దుబాటు చేస్తున్నాం

సరిపడా నిధులు లేకున్నా నెలసరి ఖర్చులకు సర్దుబాటు చేస్తున్నాం. మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో నెల వారి ఖర్చులు లక్షల్లో ఉంటాయి. ముఖ్యంగా కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లులు చెల్లింపు, చెత్త సేకరించే ట్రాక్టర్, ఇతర వాహనాల ఖర్చే దాదాపు రూ. 12 లక్షలు ఉంటుంది. దీనితో ఇతర ఖర్చులకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సర్దుబాటు చేస్తున్నాము.

- గంగన్న, కార్యదర్శి, కీసర

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



పంచాయతీలకు రావాల్సిన నిధులు విడుదల చేయించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. గ్రామాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని పనులు సక్రమంగా చేయిస్తున్నాం. కార్యదర్శులపై భారం పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాము.

- వెంకయ్య, జిల్లా పంచాయతీ అధికారి

మత్తెక్కించే పాటలు.. అర్ధనగ్న నృత్యాలు!

- విచ్చలవిడిగా మందు, విందులతో మజా
- ఆశ్లీలానికి కేరాఫ్‌గా ఫాంహౌస్‌లు

- అక్రమ సంపాదనే ధ్యేయంగా రేవ్, ముజ్రా పార్టీలు
- రోజురోజుకూ పెరుగుతున్న కల్చర్
- వరుసగా దాడులతో బయట పడుతున్న తతంగం

ఆంధ్రజ్యోతి, వికారాబాద్/రంగారెడ్డి అర్బన్, జూలై 10 : ఉమ్మడి జిల్లాలోని ఫాంహౌస్‌లు ఆశ్లీల నృత్యాలకు అడ్డాగా మారాయి. రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, వికారాబాద్ జిల్లాలోని పూడూరు మండలాల్లో అత్యధికంగా ఫాంహౌస్‌లు ఉన్నాయి. వీటిలో రేవ్, ముజ్రా పార్టీల కల్చర్ రోజు రోజుకు పెరిగి పోతోంది. పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా ఆశ్లీల నృత్యాల కల్చర్ మాత్రం మారడం లేదు. మొయినాబాద్ మండలంలోని ఓ ఫాంహౌస్‌లో సోమవారం రాత్రి 12మంది అబ్బాయిలు, నలుగురు అమ్మాయిలతో ముజ్రా పార్టీ జరిగింది. అర్ధనగ్న డ్యాన్స్‌లు చేస్తున్న క్రమంలో సమాచారం అందుకున్న పోలీసులు రైడ్ చేసి పార్టీని భగ్నం చేసిన విషయం విదితమే. ఇలా తరచూ ముజ్రా, రేవ్ పార్టీలు సర్వసాధారణమయ్యాయి. నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఫాంహౌస్‌ల యజమానులు, వర్కర్లపై కేసులు నమోదు చేయడమే కాకుండా అరెస్టు చేస్తున్నారు. పోలీసులు వరుస దాడులు చేయడంతో వాటిల్లో జరుగుతున్న తతంగాలు బయటపడుతున్నాయి. డీజే సౌండ్లు, గంజాయి, డ్రగ్స్, మద్యం తాగేందుకు స్వేచ్ఛ లేదని నగర శివారులోని ఫాంహౌస్‌లకు వెళ్తున్నారు. ఇవి నగర శివారులో ఉండడం, పోలీసుల నిఘా తక్కువగా ఉండడంతో చాలామంది వీటిల్లో వేడుకలు చేసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. నగరంలో పార్టీ చేసుకోవాలంటే చాలా ఆంక్షలు ఎదురవుతున్నాయి. సౌండ్ పెట్టకూడదు, నిర్ణీత సమయం దాటిన తర్వాత అనుమతించరు, మద్యం తదితరాలపై ఆంక్షలు ఉంటాయి. వీటి నుంచి తప్పించుకుని ఎంజాయ్ చేయాలంటే ఫాంహౌస్‌లే బెటరని పలువురు భావిస్తున్నారు. దీంతో చాలామంది చాలా రోజుల నుంచి ఫాంహౌస్‌లను అద్దెకు తీసుకుని పార్టీలు చేసుకుంటున్నారు. ఇక్కడ పోలీసుల నిఘా తక్కువగా ఉండడంతో పెద్దపెద్దగా సౌండ్లు పెట్టుకుని ఎంజాయి చేస్తున్నారు. తెల్లవారుజాము వరకు మద్యం తాగుతున్నా అడిగేవారు లేకపోవడంతో విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సంస్కృతి ఎక్కువ కావడంతో కొంత కాలం నుంచి ఫాంహౌస్‌లపై పోలీసులు నిఘా పెట్టారు. ముఖ్యంగా వీకెండ్ సమయంలో పోలీసులు దాడులు చేసి నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిని అరెస్టు చేస్తున్నారు. అర్ధనగ్న నృత్యాలకు ఫాం హౌస్‌లు కేరాఫ్‌గా మారాయి. చాలా మంది ఫాంహౌస్‌లను ఏర్పాటు చేసి దానిలో వ్యాపారం నిర్వహిస్తున్నారు. దీంతో పోలీసులు వరుసగా దాడులు చేస్తున్నారు. ఫాంహౌస్‌ల్లో మద్యం సరఫరా చేసే అనుమతులు లేకున్నా చాలా మంది నిబంధనలు పాటించడంలేదు. కొన్ని ఫాం హౌస్‌ల్లో వ్యభిచారం కూడా నిర్వహిస్తున్నట్లు పోలీసుల దాడుల్లో బయటపడినట్లు తెలిసింది. వాటిని వ్యాపార సముదాయాలుగా మార్చి మద్యం, హుక్కా తదితరాలను సరఫరా చేసి డబ్బులు సంపాదిస్తున్నారన్న విమర్శలు తలెత్తుతున్నాయి. ఇలాంటి ఫాంహౌస్‌లపై పోలీసులు మరింత దృష్టి నిలపాలని పలువురు కోరుతున్నారు.



ముజ్రా పార్టీ జరిగింది ఈ పాంహౌస్‌లోనే

డెంగీ విషయంలో జాగ్రత్త వహించాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పాల్వన్ కుమార్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో పాల్వన్‌కుమార్

వికారాబాద్, జూలై 10 : డెంగీ, మలేరియా, ఇతర అంటు వ్యాధుల నియంత్రణకు ఫీవర్ సర్వే చేసి వ్యాధి నిర్ధారణ అయిన వారికి చికిత్స అందే విధంగా జాగ్రత్త పడాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పాల్వన్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పీహెచ్‌సీ డాక్టర్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రతి పీహెచ్‌సీలో రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేయడం, అత్యవసర కేసులకు చికిత్స చేయడానికి సరిపడా బెడ్స్ రిజర్వ్ చేసుకోవడం, అన్ని పీహెచ్‌సీలలో యాంటీ స్నేక్ వీనం వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలన్నారు. వ్యాధుల నియంత్రణకు వివిధ శాఖల అధికారులతో కలిసి సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న అన్ని లెప్రసీ కేసులను ఆన్‌లైన్ నమోదు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ర్యాలీలు నిర్వహించి కుటుంబ నియంత్రణ , పిల్లల మధ్య ఎడం గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి గురువారం పాఠశాలలో ఐరన్ ఫోలిక్ మాత్రలు విద్యార్థుల చేత మింగించాలన్నారు. ఈనెల 25 నుంచి ఆగస్టు 15 వరకు పాఠశాల విద్యార్థులకు, బడి బయట పిల్లలకు మెదడు వాపువ్యాధి నియంత్రణకు ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందని అందుకు సంబంధించి యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ రవీంద్ర యాదవ్, డాక్టర్ జీవరాజ్, డాక్టర్ సాయిబాబా, వైద్యాధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రైతులకిచ్చిన హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ బూనేటి

వికారాబాద్, జూలై 10: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ బూనేటి అన్నారు. బుధవారం వికారాబాద్ కలెక్టరేట్ వద్ద రైతులతో కలిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మారుతి కిరణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీలకు కట్టుబడి ఉంటే ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల పంటల రుణమాఫీని ఏకకాలంలో చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా రెండు పంటలకు రూ. 15,000 ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు రూ. 15వేలు, అలాగే వ్యవసాయ కూలీలకు 12వేలు ఇవ్వాలని అన్నారు. ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేసి రైతులకు ఆర్థిక చేయూత ఇవ్వాలని కోరారు. రైతు భరోసా అమలులో ప్రభుత్వం తాత్సారం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రైతు భరోసా ఇవ్వాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి మాట్లాడుతూ ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని, రైతులకు న్యాయం చేయలేని, చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో జిల్లా, మండల కిసాన్ మోర్చా నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి పనిచేస్తాం



ముదిరాజ్ సంఘాలతో మాట్లాడుతున్న మత్స్య శాఖ అధికారి సౌజన్య

మోమిన్‌పేట్, జూలై 10: మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు పిన్నమోని శ్రీధర్, మత్స్యశాఖ అధికారి సౌజన్య అన్నారు. బుధవారం మోమిన్‌పేట్‌లోని కాస్లబాద్ నంది వాగు ప్రాజెక్టు సమీపంలో చేపల ఉత్పత్తి కేంద్రంలో జాతీయ 24వ ఫిషర్స్ డేను నిర్వహించారు. చేపల పెంపకందారులు సంఘటితంగా ఉంటే మత్స్య సంపద పెరిగి ఆర్థిక వృద్ధి చెందుతారన్నారు. జిల్లా నూతన మత్స్యకారుల సంఘం సభ్యులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. చేపల పెంపకందారులు మాట్లాడుతూ చెరువులను కబ్జా చేసి చేపలను వేరేవారు పట్టుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం మత్స్యకారుల సంఘాలకు ఆర్థిక సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, మత్స్య శాఖ సిబ్బంది ఆనం నర్సింలు, బోయిన రాజు, బంటు పెంటయ్య, బోయిన అంబదాస్, అంజయ్య, రాజు, శేఖర్, వీరేశం, దుర్గయ్య, బాలయ్య, మునిందర్, మహేశ్, ప్రశాంత్, రంజీత్, హనుమంతు, నర్సింలు పాల్గొన్నారు.

61ఏళ్లు నిండిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి



ఎమ్మెల్యే పీఏకు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

పరిగి,జూలై 10: రెవెన్యూ శాఖలో 61ఏళ్లు నిండిన వీఆర్‌ఏల స్థానంలో వారి వారసులను నియమించాలని వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. బుధవారం పరిగిలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి లేకపోవడంతో ఆయన వక్తిగత కార్యదర్శికి సంఘం పరిగి మండల అధ్యక్షుడు యాదయ్య, ఉపాధ్యక్షుడు సూర్యనారాయణలు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ గతంలో విడుదల చేసిన జీవోలు 81, 85 ప్రకారం 61ఏళ్లు నిండిన వీఆర్‌ఏల స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. అర్హతలను బట్టి వీఆర్‌ఏలు, రికార్డు అసిస్టెంట్లుగా నియమించాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో వెంకటేశ్, భాస్కర్, రాములు, శ్రీను తదితరులు ఉన్నారు.

పంచాయతీల్లో పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు



కొర్విచెడ్‌లో వన నర్సరీ రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్పీవో శంకర్‌నాయక్

బషీరాబాద్, జూలై 10: గ్రామ పంచాయతీ ల్లో పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తాండూరు డీఎల్‌పీవో శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం బషీరాబాద్ మండలం కొర్విచెడ్ గ్రామాన్ని ఎంపీవో రమేష్‌తో కలిసి ఆనయ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని వననర్సరీని పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీలో రికార్డులను తనిఖీ చేసి కార్యదర్శికి పలు సూచనలు చేశారు. హరిత వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రాంతాలపై ఆరా తీసిన ఆయన ఆదిశగా ఏర్పాట్లు చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. గ్రామంలోని పలు వార్డుల్లో కలియతిరిగి డ్రైనేజీ వ్యవస్థను స్వయంగా గుర్తించారు. వర్షకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే ఆవకాశం ఉందని పరిశుభ్రతకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించాలని సూచించారు.

జ్వరంతో బాధపడుతున్న హాస్టల్ విద్యార్థినులు

తాండూరు రూరల్, జూలై 10: జినుగుర్తిలో గల ఎస్టీ బాలికల హాస్టల్‌లోని కొందరు విద్యార్థినులు రెండు రోజులుగా జ్వరం, దురదతో బాధపడుతున్నారు. బుధవారం 9మంది విద్యార్థినులు ఉపాధ్యాయినులతో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రెండు రోజులుగా జ్వరం, చేతులకు దురదతో బాలికలు బాధపడుతున్నారని హాస్టల్ నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా అమ్మవార్లకు బోనాలు


ధారూరు: నాగసమందర్‌లో బోనాలతో మహిళల ఊరేగింపు

ధారూరు, జూలై 10: మండల పరిధిలోని నాగసమందర్‌లో బుధవారం పోచమ్మకు బోనాల పండుగను నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కులకచర్ల: చౌడాపూర్ మండలం మరికల్‌లో పోచమ్మదేవతకు బోనాలు నిర్వహించారు. గ్రామస్తులు నాయకులు నర్సింహారెడ్డి, దామోదర్‌రెడ్డి, శివకుమార్, నరేందర్, ప్రసాద్, రవి, నర్సింలు, రాజు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండలంలోని ఏర్పుమళ్లలో పోచమ్మకు మహిళలు బోనాలతో నైవేద్యాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని మొక్కులు తీర్చుకున్నారు.


మరికల్‌లో పోచమ్మ ఆలయానికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు


ఏర్పుమళ్లలో బోనాలతో తరలుతున్న మహిళలు

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


కడ్తాల : విద్యార్థుల బోధనా సామర్థ్యాలను పరిశీలిస్తున్న వెంకటయ్య

కడ్తాల్/ఆమనగల్లు, జూలై 10: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ సహాయ అధికారి ఉడుతనూరి వెంకటయ్య అన్నారు. కడ్తాల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, గిరిజన సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం, ఆమనగల్లు గిరిజన బాలికల వసతి గృహాన్ని బుధవారం ఏటీడీవో వెంకటయ్య తనిఖీ చేశారు. ఆయా చోట్ల రికార్డులను, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్లను, పరిసరాలను, గదులను, మరుగు దొడ్లు, మూత్రశాలలను, విద్యార్థులకు సిద్ధం చేసిన వంటకాలను, స్టోర్ రూంలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని హెచ్‌డబ్ల్యూవోలు రాములు, రామచంద్రయ్యలకు సూచించారు. విద్యార్థులకు బెడ్‌షీట్స్, కార్పెట్లు, దుస్తులు, నోట్‌బుక్స్ పంపిణీకి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమనగల్లు ఎస్టీ హాస్టల్‌లో సంక్షేమ శాఖ అధికారి రామచంద్రయ్య, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించాలని సూచించారు. హెచ్‌డబ్ల్యూవో రాంచంద్రయ్య, టీచర్లు తదితరులు ఉన్నారు.

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా రామస్వామి, పర్వతాలు



రంగారెడ్డి అర్బన్/శంషాబాద్, జూలై 10 : ఏఐటీయూసీ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా 65 మంది సభ్యులతో కూడిన జిల్లా నూతన కౌన్సిల్‌ను, 21 మంది కార్యవర్గాన్ని, 13 మంది ఆఫీస్ బేరర్స్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చేవెళ్లకు చెందిన కె. రామస్వామిని, కార్యద పానుగంటి పర్వతాలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు జిల్లా ఉపాధ్యక్షులుగా టి. నర్సింహారెడ్డి, హరిసింగ్ నాయక్, వడ్ల సత్యనారాయణ, కె. చందు యాదవ్, ఎస్ మల్లేష్‌ను నిర్మాణ కౌన్సిల్ ఏకగ్రీంగా ఎన్నికల చేసినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు తెలిపారు.

చల్లా నర్సింహారెడ్డిని కలిసిన వీర్లపల్లి శంకర్


చల్లా నర్సింహారెడ్డికి బొకే అందజేస్తున్న వీర్లపల్లి శంకర్

రంగారెడ్డి అర్బన్, జూలై 10 : తెలంగాణ స్టేట్ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కో-ఆపరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ చల్లా కవిత బాల్‌రెడ్డి, కర్మాన్‌ఘాట్ హనుమాన్ ఆలయం మాజీ డైరెక్టర్ వెంకటేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ వెంకటేష్ తదితరులున్నారు.

ప్రజాసేవతో సమాజంలో గుర్తింపు

▸▸ జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డి


మాట్లాడుతున్న అనితారెడ్డి

మహేశ్వరం, జూలై 10 : రాజకీయంగా పదవులు ఉన్నా, లేకున్నా ఎప్పుడూ ప్రజాసేవలో ఉన్నవారికి సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందని రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి అన్నారు. బుధవారం మహేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీగా ఉన్న అనితారెడ్డితో పాటు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలను సన్మానించి, శాలువాలతో సత్కరించారు. అనంతరం అనితారెడ్డి మాట్లాడుతూ ప్రజాసేవ చేయడంలో ఉన్న ఆనందం మరేదాంట్లో ఉండదని, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగపర్చుకొని ఐదు సంవత్సరాలు సేవచేసిన ప్రతీ ప్రజాప్రతినిధిని ప్రజలు ఎప్పుడూ మరిచిపోరన్నారు. ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి, ఎంపీడీవో శైలజారెడ్డి, తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మొక్కలు నాటి సంరక్షించాలి

ఇబ్రహీంపట్నం, జూలై 10: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించినప్పుడే ఆశించిన ఫలితాలు రాబడుతామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా బుధవారం ఇబ్రహీంపట్నంలోని తట్టిఖానా రోడ్డులోని ఓ వెంచర్‌లో గల పార్కు స్థలంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 700 మొక్కలు నాటుతున్నామని, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సంరక్షించాలన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, రోడ్ల వెంట విరివిగా మొక్కలు నాటాలన్నారు. ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. పర్యావరణ హితంకోసం అడవులను కాపాడుకుంటూనే కొత్తగా మొక్కలు నాటాల్సి ఉందన్నారు. తహసీల్దార్ అనిత, చైర్ పర్సన్ స్రవంతి, వైస్ చైర్మన్ మంగ, కమిషనర్ రవీందర్ సాగర్, కాంగ్రెస్ నాయకులు ఏదుల్ల పాండురంగారెడ్డి, భూపతిగల్ల మహిపాల్, మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, జూలై 10 : ఉస్మానియా యూనివర్సిటీలో విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులను అమానుషంగా పోలీసులు లాక్కెళ్లడం అప్రజాస్వామికమని, వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ అధ్యక్షుడు శిగ శంకర్ ఘటనపై స్పందించారు. ఓయూలో నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనను కవర్ చేసేందుకు వెళ్లిన పాత్రికేయులపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించడం సిగ్గుచేటు అన్నారు. చొక్కా పట్టుకుని లాక్కెళ్లడమే కాకుండా, కెమెరాలను తీయొద్దంటూ బెదిరించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనను తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు.

నిరంతరం అందుబాటులో ఉంటా

▸▸ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

▸▸ మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్

▸▸ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

శామీర్‌పేట, జులై 10: తనను ఎంపీగా గెలిపించిన మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు, బీజేపీ కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరిస్తానని ఎంపీ ఈటల రాజేందర్ భరోసా ఇచ్చారు. బుధవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం అంతాయిపల్లిలోని పుష్ప కన్వెన్షన్ హాల్‌లో ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో తనను ఎంపీ గా గెలిపించిన ప్రజలకు, బీజేపీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. తాను నియోజకవర్గంలో ప్రతి ఒక్కరి అందుబాటులో ఉంటూ బాధ్యతగా చొరవ తీసుకొని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, ప్రధాని నరేంద్రవెదీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరి అందేలా కృషి చేస్తానని ఈటల భరోసా ఇచ్చారు. పార్టీ కార్యకర్తలకు తాను ప్రాధాన్యతనిస్తు వారి సమస్యల పరిష్కారానికి కూడా చొరవతీసుకుంటానని భరోసా ఇచ్చారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుటకు తాను నిరంతరం కృషి చేస్తానని ఆయన వివరించారు. ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని అంచలంచలుగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, శామీర్‌పేట మండల బీజేపీ అధ్యక్షుడు యాదగిరి, బీజేపీ రాష్ట్ర నాయకులు బుద్ది శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్, నాయకులు హైమారెడ్డి, దండుగుల మైసయ్య, పవన్‌కుమార్‌గౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలుచేసేందుకు బీఆర్ఎస్ కుట్ర

▸▸ విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

▸▸ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూలై 10: డీఎస్సీ, గ్రూప్ పరీక్షలు వాయిదా వేయాలంటూ దళిత, గిరిజన విద్యార్థులను రెచ్చగొట్టి ఉద్యోగ నియామకాలు అడ్డుకోవడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు బీఆర్ఎస్ కుట్ర రాజకీయాలు సాగిస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ నేతల మోసపూరిత మాటలు నమ్మి నిరుద్యోగులు, విద్యార్థులు తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రూ.17.50 కోట్లతో నిర్మించే ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులకు బుధవారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు బాలాజీసింగ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గీత, టీఎస్ఎంఐడీసీ డీఈ రవీందర్‌లతో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కసిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగాల నియామకాలు రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా చేపడుతుందని చెప్పారు. విద్య, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులకు సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పేదలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా ఆధునీకరిస్తూ నూతనభవన నిర్మాణం చేపడుతున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు ఆసుపత్రి అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి మరో రూ.10 కోట్లు ఇవ్వడానికి సానుకూలత వ్యక్తం చేశారని తెలిపారు. ఆమనగల్లులో పాలిటెక్నిక్, ఐటీఐ, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ విద్యాలయాల ఏర్పాటుకు సీఎం ను కోరగా సానుకూలంగా స్పందించారని చెప్పారు. డాక్టర్ పరీక్షిత్, డాక్టర్ జయశ్రీ, అర్చనారెడ్డి, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, తహసీల్దార్ లలిత, మున్సిపల్ కమిషనర్ వసంత, ఎంఈవో సర్దార్‌నాయక్, మాడ్గుల మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అనితవిజయ్, ప్రజాప్రతినిధులు, నాయకులు మెకానిక్‌బాబా, జగన్, కృష్ణానాయక్, సూదిని కొండల్ రెడ్డి, వస్పుల జంగయ్య, మండ్లీ రాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖలో ప్రక్షాళన

▸▸ సస్పెన్షన్‌కు గురైన అధికారి స్థానంలో శ్యాం కుమార్

▸▸ ఒకే సారి వికారాబాద్, ధారూరు రేంజర్‌గా బాధ్యతలు



వికారాబాద్/ధారూరు, జూలై 10: అటవీ శాఖలో ప్రక్షాళన మొదలైంది. 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన 'బోనస్ మింగేశారు' కథనానికి ఎట్టకేలకు అటవీశాఖలో అవినీతికి పాల్పడిన అధికారుల స్థానంలో కొత్త అధికారులు చార్జి తీసుకున్నారు. రెండు రోజుల క్రితం తాండూరు ఎఫ్ఆర్‌వోగా అబ్దుల్ ఫైసాబ్ బాధ్యతలు స్వీకరించగా, తాజాగా బుధవారం వికారాబాద్, ధారూర్ ఎఫ్ఆర్‌వోగా శ్యాం కుమార్ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. జూలై 2న వికారాబాద్ ఎఫ్ఆర్‌వో అరుణ, తాండూరు ఎఫ్ఆర్‌వో శ్యాంసుందర్‌లను సస్పెండ్ చేయగా ఉన్నతాధికారుల ఆర్డర్లను రేంజర్లు లెక్క చేయకుండా వ్యవహరించారు. యథావిధిగా విధుల్లో ఉండడం అనంతరం ప్రచురితమైన కథనాలతో అప్రమత్తమైన అటవీ శాఖ ఉన్నతాధికారులు తాండూరు ఎఫ్ఆర్‌వోగా అబ్దుల్ ఫైసాబ్‌ను, వికారాబాద్, ధారూరు ఎఫ్ఆర్‌వోగా శ్యాంకుమార్‌కు వెంటనే చార్జి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే అధికారులు చార్జిలు తీసుకోవడంతో పాటు సస్పెన్షన్ అయిన అధికారులకు చెక్ పెట్టేశారు. అటవీ శాఖలో జరిగిన అవినీతిపై ఆ ఇద్దరు అధికారుల సస్పెన్షన్ రాష్ట్ర స్థాయిలో చర్చతో వికారాబాద్ జిల్లా అటవీశాఖలో ప్రక్షాళన అవకాశాలు లేక పోలేదనే చర్చ మొదలైంది.


ఉద్దండాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

అంగన్‌వాడీ కేంద్రాలకు నిలిచిన గుడ్ల సరఫరా

▸▸ పది రోజులుగా కొరత ▸▸ పర్యవేక్షించని అధికారులు

తాండూరు రూరల్, జూలై 10: తాండూరు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పది రోజులుగా గుడ్ల సరఫరా నిలిచిపోయింది. దీంతో టీచర్లు చిన్నారులకు గుడ్లను ఇవ్వడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకే గుడ్ల సరఫరా నిలిచిపోయిందని గర్భిణులు, చిన్నారుల తల్లిదండ్రులు అంటున్నారు. పోషకాహారం లభించక ఉద్దండాపూర్, మైసమ్మగడ్డ తండాల్లో అంగన్‌వాడీలకొచ్చే చిన్నారుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఉద్దండాపూర్ అంగన్‌వాడీకి 18 మంది రావాల్సి ఉండగా బుధవారం 10 మందే వచ్చారని టీచర్ భాగ్యలక్ష్మి తెలిపారు. కాగా రాంపూర్ అంగన్‌వాడీ టీచర్, ఆయా రాక తాళం తీసేవారే లేరు. దీంతో చిన్నారులు ఇళ్లకు వెళ్లిపోయారు. కాగా గుడ్ల సరఫరాపై ఏడీపీవో మాట్లాడుతూ గుడ్లు సరఫరా అయ్యేలా చూస్తామని, అంగన్‌వాడీల్లో సేవలు సరిగ్గా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

రేవంత్‌రెడ్డి కుట్రలు చేసినా ప్రజలు ఆదరించారు: ఎంపీ డీకే అరుణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

షాద్‌నగర్ రూరల్, జూలై 10: తనను ఓడించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా ప్రధాని మోదీపై ఉన్న నమ్మకంతో ప్రజలు గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలమూరు అభివృద్ధి కోసం పాటు పడుతానని ఎంపీ డీకే అరుణ తెలిపారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో బుధవారం షాద్‌నగర్ నియోజకవర్గ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మోదీ ప్రజలు దేశ భద్రత, అభివృద్ధి గురించి ఆలోచన చేశారని, అందువల్లే ఎన్నికల్లో ఎవరు కుట్రలు చేసినా ఫలించలేదని అన్నారు. పాలమూరు, చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాల్లో గెలుపునకు బాధ్యత తీసుకున్న సీఎం.. నైతికంగా ఓడిపోయారని తెలిపారు. నాయకులను భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. తనపై నోటి కొచ్చినట్లు మాట్లాడారని, వెనక్కి తగ్గలేదని, కార్యకర్తలు ధైర్యంగా పోరాడారని తెలిపారు. షాద్‌నగర్‌లో విద్యావంతులు బీజేపీ గెలవాలని అనుకున్నారని, అందువల్లే విజయం సాధ్యమైందన్నారు. తాను గెలవడానికి సీఎం రేవంత్‌రెడ్డియే కారణమన్నారు. పాలమూరు చరిత్రలో పొత్తు లేకుండా మొదటిసారి బీజేపీ గెలిచిందన్నారు. తన గెలుపును ప్రజలకు అంకితమిస్తున్నానని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నీరు.. నార్లాపూర్ నుంచి కాకుండా జూరాల నుంచి తీసుకుంటే పాలమూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు మండలాలు సస్యశ్యామల మవుతాయని, సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. షాద్‌నగర్ పట్టణానికి చేరుకున్న ఎంపీ అరుణ పరిగి రోడ్డు ప్యారడైజ్ కాలనీ ముందు నుంచి ఫంక్షన్ హాల్‌వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం పలు సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు అందె బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, అమడాపురం నర్సింహ, అశోక్‌గౌడ్, భూపాలాచారి, చెంది మహేందర్‌రెడ్డి, వెంకటేష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

మొయినాబాద్ రూరల్, జూలై 10: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని హిమాయత్ నగర్ గ్రామం ఎస్సీ కాలనీలోని పూడూరు బస్తీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ఫెన్సింగ్ ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి. బస్తీలో ఉండే చిన్నపిల్లలు ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోనే నిత్యం ఆటలాడుతుంటారు. విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెను ఏర్పాటు చేయాలని బస్తీవాసులు కోరుతున్నారు.


ప్రమాదకరంగా కంచె లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్


సమావేశంలో పాల్గొన్న బీకేఎస్ నాయకులతో రాజిరెడ్డి

సాగు భూములన్నింటికీ 'రైతు భరోసా' వర్తింపజేయాలి

కడ్తాల్, జూలై 10: రైతుల్లో పెద్ద, చిన్న అనే తేడా చూపకుండా సాగుచేసే భూములన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పెట్టుబడి సాయం అందించాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రాజిరెడ్డి కోరారు. ఐటీ సాకుగా చూపి రైతులకు రైతు భరోసా పెట్టుబడి సాయం ఆపకూడదని సూచించారు. మండలంలోని చల్లంపల్లిలో బుధవారం భారతీయ కిసాన్ సంఘ్ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీకేఎస్ దిల్‌సుఖ్ నగర్ భాగ్ అధ్యక్షుడు తీగల శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా అధ్యక్షుడు గడిగె గజేందర్ గౌడ్, భాగ్ సంయుక్త కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాజిరెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగం అభివృద్ధికి పాలక ప్రభుత్వాలు పెద్దపీట వేయాలన్నారు. సకాలంలో పెట్టుబడులు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తెచ్చుకొని నష్టాలకు గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పిస్తూ జీడీపీని పెంచడంలో రైతాంగం పాత్ర ప్రధానమైందని అభిప్రాయపడ్డారు. జిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్ మాట్లాడుతూ వ్యవసాయేతర భూములకు, కార్పొరేట్ రైతులకు రైతుభరోసా నుంచి మినహాయించాలన్నారు. బీకేఎస్ నాయకులు చల్ల పవన్ రెడ్డి, గుర్కా అంజయ్య, మల్లేశ్, బొజ్జ రాంరెడ్డి, గుర్కా మహేశ్ యాదవ్, జంగయ్య, కొత్త రాంరెడ్డి, రామకృష్ణ, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి


సదస్సులో మాట్లాడుతున్న సాయిచైతన్య

నందిగామ, జూలై 10: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సాయిచైతన్య సూచించారు. మండల పరిధిలోని మొదళ్లగూడ శివారులో గల సింబియాసిస్ యూనివర్సిటీలో బుధవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం, వాటి పర్యవసానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సాయిచైతన్య మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటివల్ల జరిగే నష్టాన్ని సమాజంపై చూపే ప్రభావాన్ని వివరించారు. మాదకద్రవ్యాలు కలిగి ఉన్నా, అమ్మినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మాదక ద్రవ్యాల పర్యవసానాలపై వీడియో రూపంలో సందేశాలను వీక్షింపజేశారు. కళాశాల డైరెక్టర్ సంతోష్ అగావ్, పోలీస్ ఉన్నతాధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆదర్శ కవయిత్రి మొల్లమాంబ


కవయిత్రి మొల్ల విగ్రహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూలై 10: రామాయణాన్ని తెలుగులోకి అనువదించి ఆదర్శప్రాయంగా నిలిచిన తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబయేనని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్ కుమ్మరి సంఘం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ ఆవరణ ఎదుట ప్రతిష్ఠించిన మొలమాంబ విగ్రహాన్ని బుధవారం ఎమ్మెల్యే శంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ 16వ శతాబ్దంలోనే రామాయణాన్ని అతి సులభమైన తెలుగు భాషలో అనువదించి గొప్ప కవయిత్రిగా పేరు గడించారని గుర్తు చేశారు. మొల్లను ఆదర్శంగా తీసుకుని సంస్కృతి, సంప్రదాయాలను, పురాణాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. అనంతరం కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో 301 కలశాలతో తొలి ఆశాఢ బోనాలను పోచమ్మ తల్లికి సమర్పించారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికూడ జయంత్‌రావు, ప్రధాన కార్యదర్శి దయానంద్, షాద్‌నగర్ అధ్యక్షుడు కుమ్మరి శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి రాయికల్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అగ్గనూరి విశ్వం, బాబర్‌ఖాన్, జి. బాల్‌రాజ్‌గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ అభివృద్ధికి సహకరించాలి


మాట్లాడుతున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు

శామీర్‌పేట, జులై 10 : మునిసిపాలిటీ అభివృద్ధికి కౌన్సిలర్లు తోడ్పాటునందించాలని తూంకుంట మున్సిపల్ చైర్మన్ కారంగుల రాజేశ్వర్‌రావు కౌన్సిలర్లలను కోరారు. బుధవారం మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన, కమిషనర్ వెంకటగోపాల్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. కౌన్సిలర్లు వారి వార్డుల్లోని సమస్యలపై చర్చించారు. చేపట్టనున్న అభివృద్ధి పనుల పై పలు తీర్మానాలు చేశారు. త్వరలో జరుపుకోనున్న బోనాల పండగ సందర్భంగా చేపట్టవల్సిన ఏర్పాట్లపై కౌన్సిల్ చర్చించింది. వార్డుల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌కు తీర్మానించారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు ఉన్న సమస్యలపై చర్చించారు. మున్సిపల్ పరిధిలో కౌన్సిలర్లు వన మహోత్సవ కార్యాక్రమాన్ని చేపట్టి మొక్కలను నాటాలని చైర్మన్ వివరించారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, డిప్యూటీ ఈఈ సునీత, ఆర్ఐ భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రేణుక, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నత్తనడకన 'లీకేజీ' పనులు



మొయినాబాద్ రూరల్, జూలై 10: అధికారుల నిర్లక్ష్యంతో తాగునీటి సమస్యలు పేరుకుపోతున్నాయి. ముఖ్యంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి పనితీరు సక్రమంగా లేదని హిమాయత్ నగర్ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు సైతం దృష్టి సారించకపోవడంతో హిమాయత్ నగర్ గ్రామంలో చేపట్టిన పైపులైన్ లీకేజీ మరమ్మతులు నత్తనడకన సాగుతున్నాయి. చిలుకూరు బాలాజీ దేవాలయానికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన, సాయిబాబా దేవాలయం ఎదుట తాగునీటి పైపులైను లీకేజీ అయ్యింది. దాంతో గ్రామంలో నీటి సరఫరా నిలిచిపోయింది. పంచాయతీ సిబ్బంది, సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో మరమ్మతులు నత్తనడకన సాగుతున్నాయి. దాంతో స్థానికులు, వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. చిలుకూరు బాలాజీ దేవాలయానికి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో వాహనాలు ఈ రోడ్డు నుంచే వెళుతుంటాయి.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



బొంరాస్‌పేట్‌లో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

బొంరాస్‌పేట/దౌల్తాబాద్, జూలై 10:అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఇతర రంగాల కార్మికుల సమస్యలన్నీ పరిష్కరిం చాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. డిమాండ్స్ డే సందర్భంగా బుధవారం దుద్యాలలో తహసీల్దార్ అంగన్‌వాడీ టీచర్లు, దానయ్య కలిసి వినతిపత్రం అందించారు. అంగ న్‌వాడీలకు పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలన్నారు. జీవో 10ని రద్దు చేస్తూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ 2లక్షలివ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు నవనీత, వెంకటమ్మ, రెహనాబేగం, రత్నబాయి, యాదమ్మ, రాజేశ్వరి, జ్యోతి, సావిత్రి, నర్సమ్మ, ఆనందమ్మ, సుశీలమ్మ పాల్గొన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని దౌల్తాబాద్‌లో పంచాయతీ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నర్సింగమ్మ, కవిత, పద్మ, రాములు, దస్తప్ప, పకీరప్ప, భీము లు, మల్కప్ప తదితరులు పాల్గొన్నారు.

పరిగి: ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ నిలిపి, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ పరిగి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.నర్సమ్మ, ఆశా వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి మంగమ్మ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణకు పూనుకుందన్నారు. జూలై 10ని జాతీయ వ్యాప్తంగా కార్మిక దినోత్సవంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పరిగి ప్రాజెక్టు అధ్యక్షురాలు మంజుల, స్వరూప, పుల్లమ్మ, పార్వతమ్మ, అంబబాయి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మికులు, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద



ఘట్‌కేసర్: అన్నోజిగూడలో హైవేపై ఆందోళన చేస్తున్న సీఐటీయూ కార్యకర్తలు

వారు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సంస్థలన్నింటినీ ప్రైవేటీకరణ చేస్తోంద న్నారు. దీంతో నిరుద్యోగిత పెరుగుతుందన్నారు. పంచాయతీ కార్మికులకు జీవో-51ని సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, అంగన్‌వాడీ టీచర్లు ఆశ వర్కర్లు, గ్రామపంచాయతీ వర్కర్స్ సీఐటీయూ నాయకులు సురేష్, జయంతి, రాజమణి, లక్ష్మి, శ్రీదేవి, భాగ్యలక్ష్మి, శశికళ, రామానుజమ్మ, శోభ, శ్యామలమ్మ, షబ్బీర్ భీమయ్య, నర్సింహులు, అంబరప్ప, రాములు, వెంకట్‌రాములు, శాంతమ్మ,



కులకచర్ల తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశాలు

హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులు ఉద్యమించాలని సీఐటీయూ మండల కార్యదర్శి సబిత అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధి అన్నోజిగూడలో కార్మికుల డిమాండ్స్ సందర్భం గా నిర్వహించిన ఆందోళనలో ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రాగానే ప్రైవేటీకరణ విధానాలను వేగవంతం చేస్తోందన్నారు. బొగ్గు బ్లాకుల వేలం, ఈపీఎఫ్ చెల్లించని యాజమాన్యాలకు విధించే జరిమానాలను తగ్గించిందన్నారు. కార్పొరేట్ శక్తులకు లాభాలను కట్టబెట్టేందుకు పాటుపడుతోందన్నారు. కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో అశోక్, శ్రీకాంత్, చంద్రమోహన్, గణేష్, మల్లేష్, హనుమంతు, రమేష్, వెంకటేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



పరిగి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కులకచర్ల: కులకచర్ల ఆశా వర్కర్లు తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశాలు సునీత, రాధిక, సుజాత, శ్వేత పాల్గొన్నారు.

పూడూరు: కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎం స్కీంను రక్షించాలని ఆశాలు తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఎన్‌హెచ్‌ఎం స్కీంకు బడ్జెట్ పెంచాలి, ఆశాలకు నష్టంకలిగించే పరీక్షలను కేంద్రం రద్దుచేయాలని, డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లను రద్దుచేయాలన్నారు. కార్యక్రమంలో ఆశాలు లలిత, మీనా, జ్యోతి, రేణుక, శివలీల, లక్ష్మి, జయమ్మ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.



పూడూరు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు



దౌల్తాబాద్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మికులు, సీఐటీయూ నాయకులు

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

● గతంలోనే భార్య మృతి ● అనాథలైన ముగ్గురు పిల్లలు



మృతి చెందిన కుమ్మరి శ్రీనివాస్

కొడంగల్ రూరల్, జూలై 10 : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటన కొడంగల్ మండలంలో జరిగింది. కాగా ఈ వ్యక్తి భార్య గతంలోనే మరణించగా వారి ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. ఏఎస్సై బాలకిషన్ తెలిపిన వివరాల మేరకు.. కోస్గి మండలం సర్జఖాన్‌పేట్‌కు చెందిన కుమ్మరి శ్రీనివాస్ (36) మంగళవారం దౌల్తాబాద్ మండలం చంద్రకల్ వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా చిట్లపల్లి గేటు సమీపంలో బైక్ అదుపు తప్పి పడిపోయాడు. స్థానికులు అతడిని కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. శ్రీనివాస్ భార్య ఆరు నెలల క్రితం మృతిచెందింది. వారికి ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. తల్లిదండ్రుల మృతితో పిల్లలు అనాథలయ్యారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యురాలు యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బాలకిషన్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మేక, ఎద్దు మృత్యువాత



పలుగురాళ్ల తండాలో మృతిచెందిన ఎద్దు.. రోదిస్తున్న రైతు

కొడంగల్ రూరల్, జూలై 10: విద్యుదాఘాతంతో ఓ మేక, ఎద్దు మృతిచెందిన సంఘటన మండలంలో జరిగింది. హుస్సేన్‌పూర్‌లో కుర్వ బీరప్పకు చెందిన మేక మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతిచెందింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ లేకే మేక మృతి చెందిందని, మేక విలువ రూ.20వేలు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. మరో ఘటనలో పర్సాపూర్ పరిధి పలుగురాళ్ల తండాలో మునిగారి సాయిలుకు చెందిన ఎద్దు కరెంట్ షాక్‌తో మృతిచెందింది. పొలంలో మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి ఎద్దు మృతిచెందింది. ఎద్దు విలువ రూ.50వేలు ఉంటుందని కళేబరం వద్ద రైతు రోదించాడు.

రాపోల్ అంగన్‌వాడీ కేంద్రాల్లో చోరీ

పరిగి,జూలై 10: మండలంలోని రాపోల్ అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం రాత్రి దొంగతనం జరిగింది. దొంగలు రెండు అంగన్‌వాడీ కేంద్రాల తలుపుల తాళాలు విరగ్గొట్టి లోపల ఉన్న 30 ట్రేల గుడ్లు, క్వింటాలు బియ్యం, గ్యాస్ సిలిండర్, వంటనూనె ప్యాకెట్లు, కందిపప్పు, పిల్లలకు ఇచ్చే పౌష్టికాహార బస్తాలను ఎత్తుకెళ్లారు. దాదాపుగా రూ.20వేలకుపైగా విలువైన వస్తువులు తీసుకెళ్లారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. అంగన్‌వాడీ టీచర్ బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. గతంలోనూ ఈ అంగన్‌వాడీల్లో చోరీలు జరిగాయి.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

యాలాల, జూలై 10 : హత్యాయత్నం కేసులో ఇద్దరు దోషులకు 10 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం తీర్పు ఇచ్చారని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి వివరాల ఇలా ఉన్నాయి. 2013లో గిరాజాపూర్‌నకు చెందిన అంబరప్ప, వెంకటప్పలు అదే గ్రామానికి చెందిన మైలారం వెంకటప్పతో బోర్ మోటార్ విషయంలో గొడవపడేవారు. 29-5-2013న వెంకటప్ప పొలం వద్దకు వెళ్లగా అంబరప్ప, వెంకటప్ప కర్రలతో కొట్టగా గాయాలయ్యాయి. అతడిని తాండూరు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తమ్ముడు విజయ్ ఫిర్యాదు అప్పట్లో ఎస్‌ఐ నాగార్జున కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో అంబరప్ప, వెంకటప్పలకు పదేళ్ల జైలు, రెండు వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్పీ తెలిపారు.

దొంగతనం కేసులో ఇద్దరికి రిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, జూలై 10 : ఇంటి తాళం పలుగలగొట్టి దొంగతనం చేసిన ఇద్దరిని పోచారం ఐటీసీ పోలీసులు అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఐటీసీ పోలీసుస్టేషన్ సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. చౌదరిగూడలోని వెంకటాద్రి టౌన్‌షిప్ ఫేజ్-2లో ఉంటున్న ఇటికాల ప్రవీణ్‌కుమార్ ఈ నెల 5న తన కూతురిని ఆసుపత్రిలో అడ్మిట్ చేశాడు. మరుసటి రోజు వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి 23 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకపోయారు. దీంతో ప్రవీణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీలు, వేలి ముద్రల ఆధారంగా పాత నేరస్థుడు జవహర్‌నగర్‌కు చెందిన బొంత శేఖర్(23)ను అదుపులోకి తీసుకున్నారు. శేఖర్‌తో మరో నిందితురాలు జంగలం లక్ష్మి(38) ఉన్నట్లు తెలింది. శేఖర్‌పై కీసర, హయత్‌నగర్, మేడిపల్లి పోలీసుస్టేషన్లలో కేసులున్నాయి. ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 19తులాల బంగారు, వెండి ఆభరణాలను, 4.9లక్షల నగదును రికవరీ చేశామని పోలీసులు తెలిపారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

చెక్‌పోస్టు వద్ద గుట్కాల స్వాధీనం

దౌల్తాబాద్, జూలై 10: నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని చంద్రకల్ చెక్‌పోస్టు వద్ద ఎస్సై రవిగౌడ్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేయగా దౌల్తాబాద్‌కు చెందిన దోరేపల్లి హరీశ్‌గౌడ్, నీలి వెంకటయ్యలు కర్ణాటక నుంచి ద్విచక్ర వాహనంపై తెచ్చిన గుట్కాను పట్టుకున్నారు. గుట్కా ప్యాకెట్ల విలువ రూ.24,150 ఉంటుందని తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

వివాహిత అదృశ్యం



మన్ని

మూడుచింతలపల్లి, జూలై 10: వివాహిత అదృశ్యమైన సంఘటన శామీర్‌పేట్ పీఎస్ పరిధిలో బుధవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూంకుంట మున్సిపాలిటీకి చెందిన భార్యాభర్తలు రమేశ్(30), మన్ని(27) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల జూలై 7న రమేశ్ ఇంట్లో పడుకొని నిద్రలేచే సరికి తన భార్య మన్ని కనిపించలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో రమేశ్ శామీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ఏస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పీఎం కిసాన్ కోసం రీ వెరిఫికేషన్ చేసుకోవాలి

బొంరాస్‌పేట్, జూలై 10: పీఎం కిసాన్ సమ్మాన్ కోసం రైతులు రీ-వెరిఫికేషన్ చేయించుకోవాలని ఏఈవో మెయినుద్దీన్ తెలిపారు. బుధవారం దుద్యాలలో రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మిగతా రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా పంట సాగు చేసిన రైతులు పట్టా పాసుపుస్తకం, సర్వే నెంబర్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ

కీసర రూరల్, జూలై 10: పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని నాగారం మునిసిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం రాంపల్లిలో వనమహోత్సవాన్ని నిర్వహించారు. తారక్ ఎన్‌క్లేవ్‌లో మొక్కలు నాటారు. మునిసిపాలిటీలో పచ్చదనం పెంపునకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా కాలనీ రోడ్లకు ఇరువైపులా మొక్క లు నాటుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ జి.కళావతి, కమిషనర్ రాజేందర్‌కుమార్, డీఈఈ సుదర్శనం రఘు, మేనేజర్ చంద్రశేఖర్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయానికి రూ.1.16లక్షల విరాళం

తాండూరు రూరల్, జూలై 10: తాండూరు మండలం అంతారంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ పట్లోళ్ల దీపాన ర్సింహులు రూ.1లక్ష 16వేల విరాళం ఇచ్చారు. బుధవారం అంతారం గ్రామస్తులు వైస్ చైర్‌పర్సన్‌ను మర్యాదపూర్వకంగా కలవగా, దేవాలయ నిర్మాణానికి సాయం అందించారు. ఆమె మాట్లాడుతూ హనుమాన్ ఆలయ నిర్మాణానికి తనవంతు తోడ్పాటు అందిస్తామన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ శాంతు, గ్రామ యువకులు ఉన్నారు.

ట్రైకాస్ చైర్మన్‌ను కలిసిన రెడ్డియా నాయక్



బెల్లయ్యనాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెడ్డియా

ఘట్‌కేసర్, జూలై10: తెలంగాణ రాష్ట్ర ట్రైకార్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌ను పోచారం మున్సిపల్ వైస్ చైర్మన్ రెడ్డియానాయక్ బుధవారం నగరంలోని కార్యాలయంలో కలిశారు. బెల్లయ్యకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరినట్లు తెలిపారు. కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన వారిలో బోడుప్పల్ కార్పొరేటర్ భూక్య సుమన్, మేడ్చల్ జిల్లా ఏబీఎస్ఎస్ కోశాధికారి డీఎస్ నాయక్ ఉన్నారు.

ఎస్పీని కలిసిన మారుతీకిరణ్

పరిగి, జూలై 10: నూతన ఎస్పీ నారాయణరెడ్డిని బుధవారం పరిగి బీజేపీ నాయకులు, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.మారుతీకిరణ్ బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. కొత్తగా వచ్చిన ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీని కలిసినవారిలో హరికృష్ణ, ఆంజనేయులు ఉన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటి

కష్టపడి పనిచేసే వారికే పదవులు



వీడ్కోలు సమావేశంలో మాజీ జడ్పీటీసీ ధారాసింగ్, ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

పెద్దేముల్, జూలై 10: కష్టపడి పనిచేస్తే పదవులే వారి ఇంటి గడప తొక్కుతాయని, పార్టీ కోసం పనిచేసే వారికి పదవులు తప్పక వరిస్తాయని తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి అన్నారు. మాజీ జడ్పీటీసీ ధారాసింగ్, పలువురు మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోట్‌పల్లి నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను సన్మానించారు. పెద్దేముల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జడ్పీటీసీగా, సర్పంచ్‌గా, ఎంపీపీగా ఏ పదవులు పొందినా ధారాసింగ్ ఆ పదవికే వన్నె తెచ్చారని కొనియాడారు. మండల అభివృద్ధికి ఆయన నిరంతరం తపనపడుతుంటారని చెప్పారు. పనిచేసే వారికి కాంగ్రెస్ పార్టీ గుర్తింపును ఇస్తుందన్నారు. ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందని తెలిపారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను బీఆర్ఎస్ పాలన అప్పుల రాష్ట్రంగా మార్చిందని విమర్శించారు. బీఆర్ఎస్ పాలకులు మనకు చిప్ప మిగిల్చారని అన్నారు. పదేళ్లలో కోట్‌పల్లి ప్రాజెక్టుకు వారు చిల్లిగవ్వ ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు 110కోట్లు మంజూరు చేయనుందన్నారు. నియోజకవర్గంలో విద్య, వైద్యంలో కొన్ని సమస్యలు ఉన్నాయని, త్వరలో వాటిని పరిష్కరించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

● రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న మనోహర్‌రెడ్డి



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తాండూరు, జూలై 10:తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బుధవారం తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలు ఎలా అందుతున్నాయని ఆరాతీశారు. ఏమైనా సమస్యలున్నాయా అని ఉద్యోగులు, డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్, జనరల్, స్త్రీల మెడికల్, బ్లడ్ బ్యాంకు విభాగాలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలుందించడానికి కావాల్సిన సౌకర్యాలు, ఖాళీ పోస్టుల వివరాలను మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మూర్తిని అడిగి తెలుసుకున్నారు. చుట్టు పక్కల ఆస్పత్రి ఆవరణలో డ్రైనేజీ సమస్యపై ఎమ్మెల్యే దృష్టికి కొందరు తీసుకుపోగా మున్సిపల్ కమిషనర్ విక్రమ సింహారెడ్డిని పిలిపించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ అవసముందని సిబ్బంది ఎమ్మెల్యేను కోరగా మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మురళీకృష్ణాగౌడ్ అంబులెన్స్‌ను ఆస్పత్రికి వితరణ చేస్తున్నారని అక్కడే ఎమ్మెల్యే ప్రకటించారు.

కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఈ ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయిలో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే పెద్ద ఆస్పత్రి తాండూరులోనే ఉందని, ఈ ఆస్పత్రిని తాండూరు ప్రజలతోపాటు కర్ణాటక, కొడంగల్ ప్రాంతాల ప్రజలు వస్తుంటారని, అందరికీ వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యేతో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కాంగ్రెస్ నాయకుడు హబీబ్‌లాల తదితరులున్నారు.

ఆలిండియా మౌంటెనీరింగ్ కోర్సుకు క్యాడెట్ల ఎంపిక

ఘట్‌కేసర్ రూరల్, జూలై 10: వెంకటాపూర్‌లో గల అనురాగ్ యూనివర్సిటీకి చెందిన ఇద్దరు ఎన్‌సీసీ క్యాడెట్లు ఆలిండియా మౌంటెనీరింగ్ కోర్సుకు ఎంపికయ్యా రు. సాయి అభివర్ధన్, లొట్టిపల్లి కల్యాణి జూలై 24న ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉత్తరకాశీలో జరిగే ఆలిండియా మౌంటెనీరింగ్‌లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్యాడెట్లను బుధవారం యూ నివర్సిటీలో డీన్‌లు విష్ణుమూర్తి, విజయ్‌కుమార్, శ్రీనివాస చలపతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లేష్ అభినందించారు.



ఎంపికైన ఎన్‌సీసీ క్యాడెట్లతో వర్సిటీ అధికారులు

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానాలు



పరిగి : బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సిబ్బంది

పరిగి, జూలై 10: పలు మండలాల్లో బదిలీలపై వెళ్లిన ఉపాధ్యాయులను స్కూలు సిబ్బంది, గ్రామస్తులు బుధవారం సత్కరించారు. పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నం:02 పాఠశాలలో కొన్నేళ్లు పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు పాఠశాల ఆవరణలో సన్మానించారు. హెచ్ఎం శంకర్ ఆధ్వర్యంలో అమర్‌నాథ్, సత్యనారాయణరెడ్డి, గోపాల్ తదితరులను పూలమాలలు,శాలువాలతో సన్మానించారు. వారి సేవలను హెచ్ఎం కొనియాడారు. కార్యక్రమంలో టీచ ర్లు శారదాదేవి, స్వప్న, రవీందర్, హరిశ్చందర్, మంగిలాల్, నిర్మల, అనిల్, నర్సింహరాజు, రాఘవేందర్‌రెడ్డి, శ్రీవేణి, అనిత, బాలమణి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్: మంతట్టి ప్రాథమిక, జడ్పీహెచ్ఎస్ పాఠశాలల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు వీడ్కోలు పలికారు. ప్రధానోపాధ్యాయులు శివకుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సుబ్బనాయక్, సురేష్, మమత, గోవిందలకు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దశరథ్, హన్మంతరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కీసర రూరల్: కష్టపడే తత్వమున్న ప్రతీ టీచర్‌ను విద్యార్థులు గుర్తుంచుకుంటారని నాగారంలోని సికింద్రాబాద్ కంటోన్మెంట్, బహదూర్‌పుర నియోజకవర్గాల మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల ప్రిన్స్‌పాల్స్ అంజన్న, గౌతంరెడ్డి అన్నారు. ఇక్కడి నుంచి పదోన్నతిపై ఇతర కళాశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులు అంజిరెడ్డి, మురళీక్రిష్ణ, సైదులు, నాగిని, స్వాతి, అమలాదేవి, ప్రవళికలకు ఘనంగా వీడ్కోలు చెప్పారు. వారిని శాలువాలతో సత్కరించారు. తోటి సిబ్బందితో సమన్వయంతో ఉంటూ, ఉత్తీర్ణతలో మంచి ఫలితాలు వచ్చేందుకు కృషిచేసిన ప్రతి ఉపాధ్యాయునికి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



బషీరాబాద్: మంతట్టి పాఠశాలలో టీచర్లకు సత్కారం



కీసర రూరల్: ఉపాధ్యాయులతో హెచ్ఎంలు అంజన్న, గౌతంరెడ్డి

సంక్షిప్తంగా..

● **తాండూరు రూరల్:** టీజీపీఎస్‌సీ నిర్వహించే గ్రూప్-2 పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ తారాసింగ్, ఆర్ఐ బాల్‌రాజ్ బుధవారం పరిశీలించారు. వచ్చే నెల 6, 7తేదీల్లో గ్రూప్-2 ఆన్‌లైన్ పరీక్షకు తాండూరులో 11 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇన్విజిలేటర్లు ఎంతమంది, సీసీ కెమెరాలు ఉన్నాయా? పరీక్ష నిర్వహణకు కంప్యూటర్లు ఉన్నాయా? జనరేటర్ ఉందా? అభ్యర్థులు కూర్చొని రాసేలా ఫర్నిచర్ ఉందా? తదితర సౌకర్యాలపై ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలతో అధికారులు చర్చించారు. నివేదికను ఉన్నతాధికారులకిస్తామని తహసీల్దార్ తెలిపారు.

● **పూడూరు:** తమ భూమిని కొందరు కబ్జా చేసి చంపుతామని బెదిరిస్తున్నారంటూ చెన్‌గోముల్‌కుచెందిన కొందరు రైతులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. రైతులు చిన్న బందయ్య, చాకలి బందెయ్య, పెద్ద బందెయ్యలకు పట్టా భూమి ఉంది. వారి భూముల్లో యాహియాఖాన్ అనే వ్యక్తి తన పేరున పట్టా చేసుకున్నాడని రైతులు ఫిర్యాదులో పేర్కొన్నారు. యాహియాఖాన్, ఒమర్‌ఖాన్ మరికొందరు కలిసి తమ భూమి వారికి అమ్మాలంటూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారని వాపోయారు. తమను బెదిరింపులకు గురిచేస్తున్న చర్యలు తీసుకోవాలని రైతులు ఎస్పీని కోరారు.

● **తాండూరు రూరల్:** మండలం జినుగుర్తి గ్రామానికి చెందిన అంజిలప్ప కుటుంబానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పరామర్శించారు. అంజిలప్ప ఇటీవల కల్తీకల్లు తాగి మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఉపాధ్యక్షుడు పి.నర్సింహులు, ఎంఎస్‌పీ నాయకులు బి.వెంకటేశం, సి.నర్సింహులు, చంద్రప్ప, మోహన్, దశరథ్ తదితరులు మృతుడి కుటుంబాన్ని కలిసి మనోధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్తీకల్లు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే జిల్లా వ్యాప్తంగా కల్తీకల్లు బాధితులకు న్యాయం జరిగేవిధంగా పోరాడతామని అన్నారు. అధికారులు వెంటనే చట్టరీత్యా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని వారు కోరారు.

● **ధారూరు:** మండల పరిధిలోని ఎబ్బనూర్, లక్ష్మీనగర్ తండాల్లో బోర్‌వెల్‌లను డ్రిల్ చేశారు. తాగునీటి సౌకర్యం నిమిత్తం నియోజకవర్గ ప్రత్యేక నిధులతో అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ ఈ గ్రామాలకు బోర్‌వెల్స్ సాంక్షన్ చేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బుజ్జయ్యగౌడ్, బాబాఖాన్, కిరణ్ కుమార్, అంజయ్య, అశోక్‌ముదిరాజ్, ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.

పూడూరు: మండల పరిధిలోని మన్నెగూడ వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి తాగు నీరు అంతా వృథాగా పోతోంది పెద్ద ఎత్తున నీరు ఎగిసిపడుతుండటంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంత భారీగా పైప్‌లైన్ లీకేజీ అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ వాహనదారులు వాపోయారు. ఎక్కడ చూసినా మిషన్ భగీరథ పైప్‌లైన్ల లీకేజీలు అయి నీరు వృథాగా పోతోంది. వెంటనే అధికారులు స్పందించి మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బాగా బోధించే ఉపాధ్యాయులు చిరకాలం గుర్తుంటారు

ఘట్‌కేసర్,జూలై 10: విద్యార్థులతో కలిసిపోయి విద్యాబోధన చేసే ఉపాధ్యాయులు విద్యార్థుల గుండెల్లో చిరకాలం నిలిచి ఉంటారని పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి అన్నారు. అన్నోజిగూడలో జరిగిన జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి పదవీ విరమణ అభినందన సభలో ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చెడుమార్గంలో పయనించ కుండ వారి కదలికలను గమనిస్తూ బోధన చేయాల్సిన రోజులన్నారు. ప్రతి గురువు అలానే ఉండేందుకు కృషి చేయాలన్నారు. టీచర్ విజయలక్ష్మి సేవలు మరువ లేనివని వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకటేష్‌గౌడ్, మాజీ సర్పంచులు చిన్న నర్సింహగౌడ్, లక్ష్మీనారాయణ, నాయకులు బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు స్వరూపరాణి కవిత, రాందాస్, అనురాధ, భాషయ్య, భవానీ, అమరేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.



టీచర్ దంపతులకు జ్ఞాపికను ఇస్తున్న చైర్మన్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

మోమిన్‌పేట్, జూలై 10: ఆపద పరిస్థితుల్లో పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నె శంకర్‌యాదవ్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులు లక్ష్మయ్య, నర్సింలు, నూష, చెన్నమ్మ, నాగరాజులకు చెక్కులను అందజేశారు. పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌రెడ్డి, సుభాష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బాగ్దాద్, సురేందర్, ఏరాజ్‌పాష, బుచ్చన్న, శ్రీనివాస్, బాబా, సిజ్జు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో బొంరాస్‌పేట్ ఒగ్గు కళాకారుల ప్రదర్శన

బొంరాస్‌పేట్, జూలై 10: దేశ రాజధాని ఢిల్లీలో బొంరాస్‌పేట్ మండలం నాందర్‌పూర్‌కు చెందిన మల్లికార్జున ఒగ్గుడోలు బృందం సభ్యులు ప్రదర్శన ఇచ్చారు. తెలంగాణలో బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం ఇండియా గేటు వద్ద ఒగ్గు డోలు ప్రదర్శన నిర్వహించినట్లు ఒగ్గు కళాకారుడు బీరప్ప తెలిపారు.

పల్లెల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు

బషీరాబాద్, జూలై 10: పల్లెల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పంచాయతీల కార్యదర్శులు మురుగు కాల్వల నిర్వహణ, చెత్త తొలగింపుపై దృష్టిసారించారు. కొర్విచెడ్, బషీరాబాద్, మంతన్‌గౌడ్, నవాంద్గీ గ్రామాల్లో పనులు చేపట్టారు. వార్డుల్లో పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కల తొలగింపు పనులు చేస్తున్నారు. పనులను ఎంపీడీవో రాఘవులు, ఎంపీవో రమేస్ పర్యవేక్షిస్తున్నారు.

నేవీకి ఎంపికైన విద్యార్థికి సన్మానం

కొడంగల్, జూలై 10: కొడంగల్‌లోని నవీన ఆదర్శ పాఠశాలలో చదివిన విద్యార్థి అభితేజ్‌గౌడ్ నేవీ ఉద్యోగానికి ఎంపికవడంతో బుధవారం పాఠశాలలో సన్మానించారు. అభితేజ్‌గౌడ్, అతడి తల్లిదండ్రులను కరస్పాండెంట్ డి.వెంకటయ్య, ప్రిన్సిపాల్ నరేశ్‌రాజ్ సన్మానించారు.